సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 25 । నవంబర్ । 2023



క్రీడాస్ఫూర్తిని పెంచుకోవాలి

క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు.

10లో ▸



ముమ్మరంగా కొనుగోళ్లు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మొత్తంగా 7.57 లక్షల టన్నులు సేకరించనున్నారు.

10లో ▸

మాడవీధుల నిర్మాణానికి ఆమోదం

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయం చుట్టూ మాడవీధుల నిర్మాణానికి దేవస్థానం ధర్మకర్తల మండలి ఆమోద ముద్ర వేసింది. రూ.4.50 కోట్ల అంచనా వ్యయాన్ని తీర్మానించారు.

10లో



న్యూస్‌రీల్

ఉండి స్టేషన్‌లో రికార్డులు అస్తవ్యస్తం



ఉండి: ఉండి పోలీస్ స్టేషన్‌లో శాఖాపరమైన విచారణలో భాగంగా నిర్వహిస్తున్న పరిశీలనలో రికార్డుల్లో పలు లోపాలు, అవకతవకలు, ఉల్లంఘనలు గుర్తించినట్లు అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశాల మేరకు ఉండి పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా ఉండి పీఎస్‌లో రికార్డుల్లో అవకతవకలు, సరైన విధానంలో నమోదు కాకపోవడం వంటి ఆరోపణలు, కొందరి నుండి ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టారన్నారు. ప్రధాన అంశమైన రికార్డుల నిర్వహణ విషయంలో ఉండి పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు కనిపిస్తోందన్నారు. రికార్డుల నిర్వహణ సరైన విధంగా లేకుంటే కేసులు కోర్టులో నిలబడవన్నారు. ఇక్కడ మరిన్ని కేసులకు సంబంధించి రికార్డులు పరిశీలించాల్సి ఉందన్నారు. రెండు, మూడు నెలల క్రితం ఉండి పోలీస్‌స్టేషన్‌లో రెండు లేదా మూడు కేసుల్లో రికార్డులు తారుమారైన విషయాన్ని గుర్తించామన్నారు. ప్రస్తుతం చేపట్టిన విచారణ కొనసాగుతుందని, ఫిర్యాదు చేసిన వారికి కూడా పిలిపించి విచారణ చేస్తామన్నారు. పూర్తి విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. గతంలో ఉండి ఎస్సైను అకస్మాత్తుగా శాఖాపరమైన చర్యల్లో భాగంగా వీఆర్‌కు పంపించారన్నారు.

ఐఈఎస్‌లో ఐదో ర్యాంక్



చినమిల్లి శివ

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడికి చెందిన చినమిల్లి శివన్నారాయణ (శివ) జాతీయస్థాయి యూపీఎస్సీ పరీక్షల్లో ఐఈఎస్ విభాగంలో 5వ ర్యాంకు సాధించాడు. పేద రైతు కుటుంబానికి చెందిన శివ టెన్త్‌లో 9.5 సీజీపీఏ మార్కులు సాధించాడు. పాలిటెక్నిక్‌లో రాష్ట్రస్థాయిలో 241వ ర్యాంక్, ఈసెట్‌లో 70 ర్యాంకులతో సత్తాచాటాడు. గేట్ పరీక్షలో 321వ ర్యాంకు పొంది ఐటీసీఎల్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం సంపాదించాడు. ఈ క్రమంలో ఐఈఎస్ పరీక్షల్లో జాతీయస్థాయి ర్యాంకును కైవసం చేసుకున్నాడు. తల్లిదండ్రులు చినమిల్లి సూరిబాబు, భ్రమరాంబ, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

చట్టాల అమలుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలు, నేరాలు నిరోధించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని, చట్టాల అమలుకు నూరు శాతం కృషి చేస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పౌర హక్కుల రక్షణ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు అట్రాసిటీల నిరోధక చట్టాల అమలు తీరుపై సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులతో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సభ్యుల కోరిక మేరకు నెలకోసారి ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌డే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 15,367 ఎకరాల అసైన్డ్ భూమి ఉందని, 20 ఏళ్లకుపైగా అనుభవిస్తున్న వారికి భూహక్కు పత్రాలు అందిస్తామన్నారు. దీనివల్ల ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు లబ్ధి జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ మాట్లాడుతూ వివిధ విభిన్న కారణాలతో కేసులు నమోదవుతున్నాయన్నారు. సాధ్యమైనంత త్వరలో కేసులు పరిష్కారానికి పోలీసు శాఖ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. భీమవరం అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసేందుకు వీలుగా మెట్లు ఏర్పాటుచేయాలని కమిటీ సభ్యులు కోరారు. చర్మకారులకు ఉపాధి, రుణ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధితులకు సత్వర న్యాయం చేయాలని కోరారు. డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీఓలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

ఏటీఓగా శ్రీవిద్య

ఏలూరు (మెట్రో): ఏపీపీఎస్సీ గ్రూప్–1 సర్వీసు ద్వారా అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా జిల్లా ఖజానా కార్యాలయానికి ఎస్.విద్యను నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఖజానా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా శాఖ తరపున అధ్యక్షుడు యూవీ పాండురంగారావు, సెక్రటరీ కప్పల సత్యనారాయణ, ట్రెజరర్ నెరుసు గణేశ్వరరావు ఆమెకు అభినందనలు తెలిపారు. అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ పి.ప్రేమావతి, ఉప ఖజానాధికారి గెడ్డం విజయ్‌గణేష్ బాబు పాల్గొన్నారు.

కమనీయం.. తెప్పోత్సవం



శ్రీవారి సుదర్శన పుష్కరిణిలో హంస వాహనంపై తెప్పోత్సవం

చిన వెంకన్న పుష్కరిణిలో వేడుక

క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకుని ద్వారకాతిరుమల క్షేత్రంలో శుక్రవారం రాత్రి తెప్పోత్సవ వేడుక నేత్రపర్వంగా జరిగింది. తిరువీధి సేవ అనంతరం పుష్కరిణి వద్దకు చేరిన ఉత్సవమూర్తులను దేదీప్యమానంగా వెలుగొందుతున్న హంస వాహన తెప్పలో వేంచేపు చేయగా ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, అర్చకులు పూజాదికాలు చేశారు. అనంతరం హంస వాహన తెప్ప విహరించింది. ట్రస్టు బోర్డు సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. – ద్వారకాతిరుమల



వీక్షిస్తున్న భక్తులు, (అంతరచిత్రం) స్వామి, అమ్మవార్లు

యువత.. ఓటే భవిత

వజ్రాయుధం

- 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించడమే లక్ష్యం
- విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- విద్య సంబంధిత **పథకాల** లబ్ధిదారుల్లో **అర్హుల గుర్తింపు**
- డ్రాప్‌అవుట్లలోనూ అర్హులను గుర్తిం**చేందుకు కసరత్తు**
- 9 వరకు కొత్త **ఓటర్ల** నమోదు, మార్పు**లు**, చేర్పులకు **అవకాశం**
- జనవరి 5న తుది జాబితా **ప్రమరణ**





తాడేపల్లిగూడెంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఓటు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సాక్షి, భీమవరం: మరికొద్ది నెలల్లో సార్వత్రిక సమరానికి తెరలేవనుండగా **పూర్తి పారదర్శకంగా ఓటర్ల** తుది జాబితా సిద్ధం చేసే పనిలో ఎన్నికల సంఘం నిమగ్నమైంది. ఇప్పటికే ముసాయిద జాబితా విడుదల చేసింది. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు నమోదు, మార్పులు, చేర్పుల కోసం వచ్చేనెల 9వ తేదీ వరకు మరో అవకాశం ఇచ్చింది. ఈమేరకు అర్హత కలిగిన యువతకు వజ్రాయుధాన్ని ఇచ్చేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు.

డోర్ టు డోర్ సర్వే

ప్రజల జీవన ప్రమాణాలు పాలించే వారి సమర్థతపై ఆధారపడి ఉంటాయి. అటువంటి పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన ఆయుధం ఓటు హక్కు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించే లక్ష్యంతో ఏటా ఈసీ స్పెషల్ సమ్మరీ రివిజన్ నిర్వహిస్తుంది. ఈ ఏడాది జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు డోర్ డూ డోర్ సర్వే నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, మృతిచెందిన వారి తొలగింపులు, అభ్యంతరాల స్వీకరణ తదితర ప్రక్రియల అనంతరం గత నెల 28న అధికారులు ముసాయిద జాబితాను విడుదల చేశారు.

ఏ ఫారం ఎందుకంటే..

- ఫారం–6 : కొత్త ఓటరు నమోదు
- ఫారం–6ఎ: భారతీయ పాస్‌పోర్టు కలిగిన విదేశాల్లోని భారతీయుల ఓటు నమోదు
- ఫారం–6బి: ఓటరు కార్డును ఆధార్‌కు లింక్ చేయడం
- ఫారం–7: ఓటరు జాబితా నుంచి పేరు తొలగింపు
- ఫారం–8: ఓటులో మార్పుల కోసం (చిరునామా, డూప్లికేట్ కార్డు కోసం)

ముసాయిదా ఓటర్ల జాబితా

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
భీమవరం	1,20,857	1,27,428	46
ఆచంట	87,602	89,839	0
పాలకొల్లు	94,391	97,936	10
నరసాపురం	82,545	83,020	1
ఉండి	1,08,235	1,19,343	2
తణుకు	1,13,226	1,19,343	6
తాడేపల్లిగూడెం	1,0,2752	1,07,631	12

జిల్లాలో ఓటర్లు : ముసాయిదా గణాంకాల మేరకు జిల్లాలో 14,47,509 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 7,09,608, మహిళలు 7,37,824, ఇతరులు 77 మంది ఉన్నారు. తుది జాబితా విడుదలలో భాగంగా ఇంకా మిగిలి ఉన్న కొత్త ఓటర్లు నమోదు చేయడంతో పాటు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వచ్చేనెల 9వ తేదీ వరకు ఈసీ మరో అవకాశం కల్పించింది. ఈ మేరకు 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన అందరికీ ఓటుహక్కు కల్పించే ధ్యేయంతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రశాంతి పర్యవేక్షణలో అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది.

ముమ్మరంగా అవగాహన

జిల్లావ్యాప్తంగా కళాశాలల్లో విద్యార్థులకు ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు అవగాహన శిబిరాలు నిర్వహించి ఓటుహక్కు ప్రాధాన్యతను వివరిస్తున్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో 18 ఏళ్లు నిండిన వారి వివరాలను సచివాలయ ఉద్యోగులు, బూత్ లెవిల్ అధికారులు సేకరిస్తున్నారు. అర్హత ఉండి ఇంకా దరఖాస్తు చేసుకోని వారిని గుర్తించి ఫారం–6 కింద ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేయిస్తున్నారు. కళాశాల మధ్యలో మానేసిన (డ్రాప్‌అవుట్స్) వారిలో ఓటుహక్కు పొందాల్సిన వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం నాటికి కొత్త ఓటర్ల నమోదు కోసం జిల్లావ్యాప్తంగా 16,011 దరఖాస్తులు వచ్చాయి. వచ్చేనెల 9వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు, పాత వాటిలో మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అనంతరం జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితాను ఈసీ ప్రచురించనుంది.

జిల్లాలో ఓటర్లు

14,47,509

పురుషులు	మహిళలు
7,09,608	7,37,824

ఇతరులు	కొత్త ఓటు దరఖాస్తులు
77	16,011

పారదర్శకంగా ఓటర్ల జాబితా



ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా రూపొందించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ముసాయిదా జాబితాను ప్రచురించాం. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నదే ఎన్నికల సంఘం, ప్రభుత్వ ఉద్దేశం. అందుకు అనుగుణంగా కొత్త ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకుంటున్నాం. యువతకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించి వారిలో చైతన్యం తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్

త్వరితగతిన ఓటర్ల జాబితా సవరణ



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితా సవరణలో భాగంగా అత్యంత జాగ్రత్తగా క్లెయిమ్స్ పరిశీలనను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఓటర్ల జాబితా తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి, డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీఓ బి.శ్రీనివాసులు రాజు, ఈఆర్వోలు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ క్లెయిమ్స్‌ను, ఫారం–6,7,8 దరఖాస్తులను పక్కాగా పరిశీలించి పరిష్కరించాలన్నారు.

అర్హులతోనే ఓటర్ల జాబితా

అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరును ఓటర్ల జాబితా నుంచి తొలగించమని కలెక్టర్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ఫారం 6,7,8కు సంబంధించి 43,700 దరఖాస్తులు అందాయని వాటిలో 28,136 పరిష్కరించామని, మిగిలిన 15,564 దరఖాస్తులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. క్లెయిమ్స్, అభ్యంతరాలకు వచ్చేనెల 9వ తేదీ వరకు సమయం ఉందన్నారు. యువ ఓటర్ల నమోదుకు సీప్ యాక్టివిటీ పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు చెప్పారు. మరణించిన ఓటర్ల తొలగింపు, చేర్పులు ఎన్నికల సంఘ రేషియో ప్రకారం సమానంగా ఉన్నాయన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల కోరిక మేరకు మృతి చెందిన ఓటర్ల జాబితా, ఏ పోలింగ్ కేంద్రము ఏ ప్రాంతంలో ఉన్నదో వాటి వివరాలను కూడా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వచ్చేనెల 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఓటరు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు.

ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు పెంపు హర్షణీయం



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును ఎనిమిదేళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీఓ ఇవ్వడం హర్షణీయమని అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీవీఎస్ పాపారావునాయుడు అన్నారు. శుక్రవారం ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావునాయుడు మాట్లాడుతూ అసోసియేషన్ తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును 3 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పెంచుతూ జీఓ 90 జారీ చేయడం శుభపరిణామమని అ న్నారు. ఆఫ్ రికగ్నిషన్ కొనసాగించడం, రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకున్న అన్ని పాఠశాలలకు ఆఫ్‌లైన్ విధానాన్ని కొనసాగించడం వంటి అంశాలపై జీఓ నవంబర్ 90తో రాష్ట్రంలోని వేల పాఠశాలలకు మేలు చేకూరుతుందన్నారు. వచ్చే సంవత్సరానికి రెన్యూవల్ కోసం డిసెంబర్ 31 వరకూ గడువు ఉందన్నారు. ప్రైవేటు పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తూ జీఓను జారీ చేసిన సీఎం జగన్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రరెడ్డి, పి.చంద్రశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అపుస్మా జిల్లా కార్యదర్శి ఏవీవీ సుబ్బరాజు, రాష్ట్ర ఈసీ మెంబర్, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ మెంబర్ ఎం.రామ్‌ప్రసాద్, ఈసీ విద్యాకాంత్, పాలకొల్లు జోన్ చైర్మన్ కేవీ కృష్ణవర్మ, కోశాధికారి ఎంఎస్ వాసు తదితరులు పాల్గొన్నారు.

భూ సంస్కరణలతో పేద రైతులకు మేలు

చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: భూ పరిపాలనలో చేపట్టిన సంస్కరణల ద్వారా పేద రైతులకు మేలు చేకూరుతుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, ఆర్డీఓ ఎంఏ అంబరీష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం ద్వారా భూమిపై సర్వ హక్కులు కల్పిస్తూ హక్కుపత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ ప్రసాదరాజు మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గంలో 145 ఎకరాలకు సంబంధించి 356 మంది రైతులకు సర్వ హక్కులను ప్రభుత్వం కల్పించిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చుక్కల భూముల సమస్యలను కూడా పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అసైన్డ్ భూములపై రైతులకు హక్కులు కల్పించిన సీఎం జగన్ అభినందనీయులన్నారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాలతో ఇప్పటికే నరసాపురం నియోజకవర్గంలోని దర్బరేవులో 1,754 ఎకరాల కంపెనీ భూములను సాగుదారులైన 1,623 మంది రైతులకు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చామన్నారు. అలాగే మొగల్తూరు మండలంలోని కాళీపట్నం జమీందారీ భూముల సమస్యను కూడా పరిష్కరించి రైతులకు పూర్తి హక్కు కల్పించే కార్యక్రమం కూడా త్వరలో చేపట్టనున్నట్టు చెప్పారు. ప్రతి గ్రామంలో శ్మశాన వాటికల కోసం ప్రభుత్వం భూమి కేటాయిస్తోందన్నారు. మొత్తంగా నరసాపురం తీర ప్రాంతంలో పది వేల ఎకరాల భూములు పేదలకు అందించడం శుభపరిణామమన్నారు. అనంతరం 356 మంది రైతులకు భూహక్కు పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోని, తహసీల్దార్‌లు ఫాజిల్, అనితాకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నరసాపురంలో భూహక్కు పత్రాలు అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



ఉండిలో అసైన్డ్ భూములకు పట్టాలందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

పేదలకు మంచి చేసింది జగన్ ప్రభుత్వమే

ఉండి: పేదలకు మంచి చేసేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉండి, కాళ్ల మండలాలకు చెందిన అసైన్డ్ భూముల రైతులకు పూర్తి హక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాలని పీవీఎల్ చేతులమీదుగా అందజేశారు. ఉండి మండలంలో పాందువ్వ ఖండ్రిక ప్రాంతానికి చెందిన ఇద్దరు రైతులకు 1.58 ఎకరాలు, కాళ్ల మండలంలోని కాళ్ల, బొండాడ, పెదఅమిరం, ఏలూరుపాడుకు చెందిన 24 మంది రైతులకు 22.17 ఎకరాలకు పట్టాలు అందజేశారు. అలాగే మండలంలోని పెదపుల్లేరు, చినపుల్లేరు, పాముల పర్రు, వెలివర్రు గ్రామాల్లోని ఎస్సీలకు శ్మశాన వాటికలపై పూర్తి హక్కులు కల్పిస్తూ సంబంధిత శ్మశాన వాటికల పట్టాలను ఆయా గ్రామ కార్యదర్శులకు అందజేశారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా అసైన్డ్ రైతులను పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్ వీరి కలను సాకారం చేస్తూ అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కలిస్తూ పట్టాలిచ్చారన్నారు. అలాగే ఎస్సీలకు శ్మశానవాటికలపై హక్కులు కల్పించారన్నారు. తహసీల్దార్‌లు యేడిద శ్రీనివాస్, టీపీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, బ్యాంకు డైరెక్టర్ కరిమెరక శివనాగరాజు, అంగర రాంబాబు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కె.గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

28న కైకలూరులో సామాజిక బస్సు యాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక న్యాయం పాటించిన పార్టీ రాష్ట్రంలో ఏదైనా ఉంది అంటే అది వైఎస్సార్ సీపీనే అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. స్థానిక సీతారామ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఈనెల 28న కైకలూరులో జరుగనున్న బస్సు యాత్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, రాష్ట్ర వడ్డి కార్పొరేషన్ చైర్మన్ సైదు గాయత్రి సంతోషి, ఎంపీపీలు అడవి వెంకటకృష్ణమోహన్, రామిశెట్టి సత్యనారాయణ, చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్లు దండే పుష్పలత, అయినాల బ్రహ్మాజీ, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తణుకు డిపోను పరిశీలించిన ఆర్టీసీ బోర్డు డైరెక్టర్



తణుకు ఆర్టీసీ డిపోలో డిపో మేనేజరుతో మాట్లాడుతున్న ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి

తణుకు అర్బన్ : ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ వ్యవస్థను మరింత పటిష్టం చేసేలా యంత్రాంగం కృషిచేయాలని ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ బోర్డు డైరెక్టర్ ఎ.రాజారెడ్డి అన్నారు. శుక్రవారం తణుకు డిపోను సందర్శించిన ఆయన పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులు, వినియోగదారులకు సురక్షిత సేవలు అందిస్తూ ఆర్టీసీని రవాణా రంగంలో ముందు వరసలో ఉంచాలని సూచించారు. అనంతరం గ్యారేజ్ ప్రాంతంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు సప్పా గిరిధర కుమార్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి రిమాండ్

ఉండి: మైనర్ బాలికను వివాహం పేరుతో వంచించి అత్యాచారానికి పాల్పడిన నిందితుడైన ఉపాధ్యాయుడు కురెళ్ళ సోమరాజుపై పోక్సో, బాల్య వివాహం, అత్యాచారం కింద కేసులు నమోదు కావడంతో అతనిని పోలీసులు గురువారం అరెస్టు చేసి శుక్రవారం కోర్టుకు తరలించారు. భీమవరం రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డీ.ధనరాజు నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించడంతో అతనిని భీమవరం సబ్‌జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

- వాతావరణంలో మార్పులతో వేగంగా చర్యలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతుల ఖాతాల్లో నగదు జమ



ఏలూరు (మెట్రో): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలిచేందుకు చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా దళారుల బారిన పడకుండా, రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా రాష్ట్ర ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. వాతావరణ మార్పులతో రైతులను అప్రమత్తం చేస్తూ వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల ద్వారా రైతన్నలను ఆదుకుంటూ ధాన్యం కొనుగోలు చేస్తూ రైతన్నకు అండగా ఉంటూ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 4లక్షల 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అంచనాలు సిద్ధం చేయగా, ఏలూరు జిల్లాలో 3 లక్షల 36 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. గతంలో రైతుల వద్ద నుంచి దళారులు, మిల్లర్లు వారికి నచ్చిన ధరకు కొనుగోలు చేస్తూ రైతును తీవ్ర ఇబ్బందులకు గురి చేసేవారు. రైతన్నలు ఆర్థికంగా నష్టపోయేలా మిల్లర్లు, దళారులు లాభపడేలా చర్యలుండేవి. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంది.

జాప్యం లేకుండా సొమ్ముల చెల్లింపు

ఇక రబీలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం అదే విధంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం ఉత్పత్తిని సైతం నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటి వరకు 29,609 మెట్రిక్ టన్నుల ధాన్యం 4,142 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయగా ఈ ధాన్యానికి రూ. 64.64 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీనిలో ఇప్పటికే రూ.44.29 కోట్లు చెల్లించి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అదే విధంగా ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఇంతవరకు 4,087 రైతుల వద్ద నుంచి 2,718 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేయగా దీనికి రూ.68.98 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే రూ. 38.2 కోట్లు చెల్లించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. ధాన్యం కొనుగోలులో కళ్లాల వద్దకే అధికారులు వెళ్ళి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. సొమ్ములు చెల్లించే విషయంలోనూ జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు



జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలులో రైతులు ఎ(్ర)లాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకుంటున్నాం. కళ్లాల వద్దకే అధికారులు వెళ్ళి కొనుగోలు చేస్తూ రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు నష్టాలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ధాన్యం ఉత్పత్తి ఆధారంగా ప్రాధాన్యతా క్రమంలో కొనుగోలు చేస్తున్నాం.

– బీ లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్

నమ్మించి మోసగించాడని మహిళ నిరసన

పెనుగొండ: పెళ్లి కాలేదని నమ్మించి పెళ్లి చేసుకున్నాడంటూ ఓ మహిళ హల్‌చల్ చేయగా, వేరే మహిళతో ఉంటున్నాడని భార్య ఫిర్యాదుతో ఆచంటలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తికి చెందిన మహిళను ఆచంట మండలం కరుగోరుమిల్లికి చెందిన గూడూరి పెద్దిరాజు గల్ఫ్‌లో ఉన్న సమయంలో పెళ్లి కాలేదని పరిచయం పెంచుకొని నమ్మించి పెళ్లి చేసుకున్నాడు. వీరు గత ఏడాది స్వదేశానికి తిరిగి వచ్చారు. ఈ తరుణంలో పెద్దిరాజుకు ముందుగానే వివాహమైందని తెలియడంతో, అన్యాయం చేయకుండా అండగానే ఉంటానని మరోసారి నమ్మించి ఆమెను పాలకొల్లులో ఉంచాడు. కొంత కాలం నుంచి మొహం చాటేయడంతో పెద్దిరాజు ఇంటికి వచ్చిన ఆమె న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగింది. తనను నమ్మించి రూ.19 లక్షలు కాజేశాడని ఆరోపించి, న్యాయం చేయాలంటూ పెద్దిరాజు ఇంటి వద్దే నిరసనకు దిగడంతో పలువురు గ్రామస్తులు మహిళతో మాట్లాడి వివరాలు తెలుసుకొన్నారు. పెద్దిరాజు అందుబాటులో లేకపోవడంతో విచారించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. పెద్దిరాజు భార్య దుర్గ భర్తపై నెల రోజుల క్రితమే మరో మహిళతో ఉంటున్నాడంటూ ఫిర్యాదు చేసింది. తనకు అన్యాయం చేస్తున్నాడంటూ ఫిర్యాదులో పేర్కొంది. ప్రస్తుతం పెద్దిరాజు అందుబాటులో లేకపోవడంతో ఇరువర్గాలు పెద్దిరాజు కోసం ఎదురు చూస్తున్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంచుకోవాలి

డీఐజీ అశోక్ కుమార్



అంతర కళాశాలల ఆటల పోటీలు, విశ్వ విద్యాలయ జట్టు ఎంపికలో మాట్లాడుతున్న డీఐజీ అశోక్ కుమార్

ఏలూరు (టూటౌన్): క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. స్థానిక సర్ సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, కాకినాడ పరిధిలోని అంతర్ కళాశాలల ఆటల పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఐజీ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. మరో ముఖ్య అతిథి సీఆర్ఆర్ విద్యాసంస్థల ఉపాధ్యక్షుడు, ఉషా పిక్చర్స్ అధినేత డాక్టర్ వీవీ బాలకృష్ణారావు మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్తేజాన్ని కలుగుజేస్తాయన్నారు. విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. పోటీల్లో జేఎన్‌టీయు కాకినాడ పరిధిలో వాలీబాల్‌లో పురుషుల జట్లు 51, మహిళల జట్లు 14, హ్యాండ్‌బాల్ పురుషుల జట్లు 13, మహిళల జట్లు 7, నెట్ బాల్ పురుషుల జట్లు 8, మహిళల జట్టు 1, షటిల్ బాడ్మింటన్ పురుషుల జట్లు 18, మహిళల జట్లు 11 పాల్గొన్నాయి. ఆటల పోటీల్లో సుమారు వెయ్యి మంది విద్యార్థులకు వసతి, భోజన సదుపాయాలు కళాశాల ప్రాంగణంలోనే ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఆర్ఆర్ విద్యాసంస్థల ఇన్‌చార్జి కార్యదర్శి కిలారు ప్రభాకరరావు, కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, మేనేజింగ్ కమిటీ సభ్యులు కె.హరి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ ఎమ్మెల్సీ పాదయాత్ర

ఎమ్మెల్సీ రఘురాజుకు స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు



భీమడోలు జంక్షన్ వద్ద ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

భీమడోలు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ విజయనగరం జిల్లా ఎస్.కోట నుంచి పాదయాత్రగా బయలుదేరిన ఎమ్మెల్సీ ఇందుకూరి రాఘురాజు తన అనుచరులతో కలిసి శుక్రవారం భీమడోలు జంక్షన్‌కు చేరుకున్నారు. మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులంతా ఆయనకు ఘన స్వాగతం పలికారు. జై జగన్, జై జై జగన్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రూపక దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి పాదయాత్రగా పార్టీ శ్రేణులంతా ఆయనతో కలిసి సూరప్పగూడెం చేరుకున్నారు. ఎఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్ ఇంటి వద్ద బస చేశారు. అనంతరం సూరప్పగూడెం నుంచి కొవ్వలి వరకు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్ తదితరులు ఆయనతో కలిసి పాదయాత్ర చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని కోరుతూ విజయనగరంలోని ఎస్.కోట నుంచి తిరుపతికి 820 కిలోమీటర్ల దూరాన్ని 43 రోజుల్లో పూర్తి చేయాలన్న సంకల్పంతో పాదయాత్ర చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 17 రోజులు పాదయాత్ర పూర్తయ్యిందన్నారు. డిసెంబర్ 21న జగనన్న పుట్టిన రోజు నాటికి తిరుపతి చేరుకుంటామన్నారు. పార్టీ శ్రేణులంతా జగనన్న కోసం ఉప్పెనలా తరలి వస్తున్నారని, ఇదే ఉత్సాహంతో ముందుకు సాగితే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 175 సీట్లు గెలవడం ఖాయమని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులు జగన్‌మోహన్‌రెడ్డిపై మెండుగా ఉన్నాయని, రెండోసారి సీఎం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, ఎం.నాగులపల్లి ఉపసర్పంచ్ కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ చిలపర్తి రామారాయుడు, మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, నాయకులు చెరుకూరి మధు, గోవింద మాలధారులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



ఆకివీడు : మండలంలోని అయిభీమవరంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కొల్లేరు సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం(ప్రకాశం చౌక్): కొల్లేరు సరస్సు కాంటూరులు, అభయారణ్య నిర్వహించడానికి సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత సర్వే టీంకు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి లాడర్ సర్వే టీం, రెవిన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖల అధికారులతో సమావేశమై కొల్లేరు కాంటూర్లు, అభయారణ్యాల నిర్వహణకు చేస్తున్న సర్వేపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐదో కాంటూరు, పదో కాంటూరు మ్యాపులను త్వరితగతిన సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం కాంటూర్ల నిర్ణయించడానికి వచ్చిన హెలికాప్టర్ టెక్నాలజీ సిబ్బందితో ఎన్ని రోజుల్లో ఈ సర్వే పూర్తి చేస్తారు, డేటా ఎప్పుడు ఇస్తారు అనే విషయంపై చర్చించారు. కొల్లేరు ప్రాంతాన్ని పరిరక్షించేందుకు ఎన్ని కిలోమీటర్లు నిర్ణయించాలి, గణపవరం, కాళ్ళ, ఉండి మండలాల్లో ఎక్కడ వరకు గుర్తించాలనేది పరిశీలించాలన్నారు. లాడర్ సర్వే త్వరితగతిన పూర్తి చేయడానికి సర్వే, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ల సహకారం తీసుకోవాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనల ప్రకారం జోన్ల ఏర్పాటుకు ఖచ్చితంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

రైల్వే గేట్ వేస్తుండగా దూసుకొచ్చిన లారీ

గంటసేపు నిలిచిపోయిన ట్రాఫిక్



శృంగవృక్షం రైల్వే గేటు పైకి దూసుకు వచ్చిన మినీ లారీ

పాలకోడేరు : రైల్వే గేట్ వేస్తుండగా అతి వేగంగా దూసుకొచ్చిన మినీ లారీ గేటును ఢీకొట్టడంతో గంటసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పాలకొల్లు–భీమవరం జాతీయ రహదారిపై శృంగవృక్షం రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు నర్సాపురం నుంచి తిరుపతి ట్రైన్ కోసం గేటు వేస్తుండగా, మినీ లారీ అతి వేగంగా దూసుకురావడంతో రైల్వే గేట్ దానిపై పడిపోయింది. ఈ లోగా ఎక్స్‌ప్రెస్ ట్రైన్ దూసుకు వస్తోంది. గేట్ మ్యాన్ సమయస్ఫూర్తితో రెడ్ సిగ్నల్ వేసి ట్రైన్‌ను స్టేషన్ లైన్‌పై ఆపి వేసి, ప్రమాదం నుంచి తప్పించాడు. ట్రైన్‌ను పంపాక ట్రాఫిక్‌కు క్లియరెన్స్ ఇచ్చి పంపించేశారు. రైల్వే గేటు విరిగిపోవడంతో దాన్ని మరమ్మతు చేశారు. ఉన్నతాధికారులకు మిని లారీ యజమాని బుంగా వెంకటరావుపై ఫిర్యాదు చేశారు.

నేడు హెల్త్ యూనివర్సిటీ వాలీబాల్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 25న ఆశ్రం వైద్య కళాశాల ఆవరణలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వాలీబాల్ మహిళ జట్టు ఎంపిక పోటీలు చేపట్టనున్నామని ఆశ్రం మెడికల్ కళాశాల పీడీ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్, డెంటల్, ఆయుర్వేదిక్, నర్సింగ్ కళాశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని వెల్లడించారు. ఎంపికైన జట్టు డిసెంబర్ 8 నుంచి శ్రీపద్మావతి మహిళ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటుందని వివరించారు.

శ్రీవారి క్షేత్రంలో మాడవీధుల నిర్మాణానికి ఆమోదం

- రూ.4.50 కోట్లతో అంచనా వ్యయం
- దాతలకు గుర్తింపు కార్డుల పంపిణీ
- ఆర్జిత సేవల్లో ఉచితంగా పాల్గొనే అవకాశం
- ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం



ధర్మకర్తల మండలి సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయం చుట్టూ మాడవీధుల నిర్మాణానికి దేవస్థానం ధర్మకర్తల మండలి ఆమోద ముద్ర వేసింది. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని స్వామివారి కొండపైన పద్మావతి కల్యాణ మండపంలో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అధ్యక్షతన శుక్రవారం ధర్మకర్తల మండలి సమావేశాన్ని నిర్వహించారు. అందులో ప్రధాన ఆలయంతో పాటు ఉప, దత్తత దేవాలయాలు, అనుబంధ సంస్థల ఆదాయ, వ్యయాలతో పాటు పలు అభివృద్ధి పనులను ఆమోదించారు. ఆలయ నైరుతి వైపున గల పాత నిత్య కల్యాణ మండపం, కార్యాలయ భవనాలను తొలగించి మాడవీధులు నిర్మించేందుకు రూపొందించిన రూ.4.50 కోట్ల అంచనా వ్యయాన్ని తీర్మానించారు.

దాతలకు పెద్ద పీట

దేవస్థానంలోని వివిధ పథకాలకు విరాళాలు చెల్లించే దాతలకు పెద్దపీట వేయాలని సమావేశంలో నిర్ణయించారు. అందులో భాగంగా ఏ పథకానికైనా లక్ష రూపాయలు విరాళం చెల్లించే దాతలకు ఏడాదిలో ఒకసారి, రూ.2 లక్షలు విరాళం చెల్లించేవారికి మూడు సార్లు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించాలని, రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు విరాళం చెల్లించే వారికి మూడు సార్లు అంతరాలయ దర్శనంతో పాటు, గరుడ సేవ లేదా స్వర్ణ తులసి దళార్చన సేవలో ఒకసారి పాల్గొనే అవకాశం కల్పించాలని తీర్మానించారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు విరాళం చెల్లించేవారికి మూడు సార్లు అంతరాలయ దర్శనం, సర్వ కైంకర్య సేవ లేదా స్వర్ణ తులసి దళార్చన సేవలో ఒకసారి పాల్గొనే అవకాశం కల్పించడంతో పాటు ముందురోజు ఉచిత వసతి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దాతకు పదేళ్ల పాటు ఈ సౌకర్యాలు అందేలా తీర్మానించారు. దాతతో కలిపి ఆరుగురికి గుర్తింపు కార్డు ఇవ్వాలని, 12 ఏళ్ల లోపు వారిని ఉచితంగా అనుమతించాలని నిర్ణయించారు.

సేవా టికెట్ల రుసుం పెంపు

పలు సేవా టికెట్ల రుసుం పెంచారు. శ్రీవారి సుప్రభాత సేవ టికెట్ రుసుం రూ.200 నుంచి రూ.300కు, అష్టోత్తరం టికెట్ రూ.300 నుంచి రూ.500కు (ఇద్దరికి రూ.200) ఉచిత దర్శనం కల్పించాలని, దీపారాధన టికెట్ రూ.10 నుంచి రూ.20కి పెంచుతూ తీర్మానించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌కు, షాపింగ్ కాంప్లెక్స్‌కు మధ్య భాగాన టెన్సిల్ ఫ్యాబ్రిక్ రూఫింగ్ ఏర్పాటుకు వచ్చిన రూ.30,63,031 టెండర్‌ను, కుంకుళ్లమ్మ ఆలయం వెనుక ఖాళీ స్థలంలో పేవర్స్ ఫ్లోరింగ్ నిర్మాణానికి వచ్చిన రూ.4,30,733 టెండర్‌ను ఆమోదించారు. అలాగే తూర్పు గోపురం పక్కన ఉన్న సప్తగోకులం, దీపారాధన మండపాన్ని తూర్పు వైపు షాపుల వద్దకు మార్చి, క్యూ కాంప్లెక్స్ పక్కనుంచి నిత్య కల్యాణ మండపం వద్దకు ఇంటర్ లాకింగ్ పేవర్స్ ఫ్లోరింగ్ నిర్మాణానికి వచ్చిన రూ. 20,09,624 టెండర్‌ను ఆమోదించారు. ధర్మ అప్పారాయ నిలయం (120 గదుల సత్రం), పలు అతిథి గృహాల్లో 70 ఏసీల ఏర్పాటుకు వచ్చిన రూ.26,34,368 టెండర్‌ను, ధర్మ అప్పారాయ నిలయంలో 4 హీట్ పంపులతో పాటు, సాఫ్టనర్, ప్రెషర్ మోటారు ఏర్పాటుకు వచ్చిన రూ. 25,76,662 టెండర్‌ను, శ్రీవారి నిత్యకల్యాణ మండపం, కొండ కింద సత్రాల వద్ద ఉన్న బోర్లకు విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు వచ్చిన రూ. 25,56,958 టెండర్‌ను ఆమోదించారు. కొండ పైన పలు ప్రాంతాల్లో పూల మొక్కలు ఏర్పాటు చేయడానికి కాంక్రీటు కుండీ (ఒక్కో కుండి ధర రూ. 2,200) కొనుగోలు చేసేందుకు నిర్ణయించారు. వచ్చే నెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనానికి రూ.100, రూ.200 టిక్కెట్లతో పాటు ప్రత్యేకంగా రూ.500 టికెట్లను ఏర్పాటు చేయాలని, ఆ రోజు తాత్కాలిక క్యూలైన్లు, చైన్ లింకు మెష్ ఏర్పాటుకు రూ. 12 లక్షల అంచనా వ్యయాన్ని, అలాగే దేవస్థానం హైస్కూల్ వద్ద వినాయకుని ఆలయాన్ని నిర్మించేందుకు రూపొందించిన రూ. 19.50 లక్షల అంచనా వ్యయాన్ని ఆమోదించారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ట్రస్టుబోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు

కమలేష్ మృతిపై దర్యాప్తు జరిపించాలి

ఏలూరు (టూటౌన్): ఇటీవల పెదవేగి గురుకుల పాఠశాలలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన దాసి కమలేష్(14) మృతిపై శాఖాపరమైన దర్యాప్తు జరిపించి నిజాన్ని వెలికి తీయాలని మృతుడి తండ్రి దాసే వెంకటేశ్వరరావు శుక్రవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల 20న రాత్రి 10.30 గంటలకు తన కుమారుడు అనుమానాస్పదంగా మృతి చెందాడని తనకు అదే రోజు రాత్రి 12.30 గంటలకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. తన కుమారుడి మృతదేహాన్ని చూడటానికి కూడా అనుమతించలేదన్నాడు. తన స్వగ్రామమైన భీమడోలు మండలం అర్జావారిగూడెంలోని బంధుమిత్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చిన తర్వాత పెదవేగి గురుకుల పాఠశాలకు వెళ్ళి ప్రశ్నించగా ప్రిన్సిపాల్, సిబ్బంది పొంతన లేని సమాధానాలు చెప్పారన్నారు. తన కుమారుడి ముఖం, కంటిపై, శరీరంపై దాడి జరిగిన ఆనవాళ్లు ఉన్నట్లు ఆయన చెప్పారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి తన కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన మోరు ఈశ్వరమ్మ

దెందులూరు: గుండుగొలను వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మోరు ఈశ్వరమ్మ (45) గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. ఆమె భర్త రోడ్డు ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈశ్వరమ్మ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.

మామిడి పంటకు బీమా

ఏలూరు (మెట్రో): సంపూర్ణ రీతూ కవచ్ రబీ 2023–24 పథకం కింద ఏపీలో మామిడి పంటకు బీమా అందిస్తున్నారని జిల్లా ఉద్యానవన శాఖాధికారి డాక్టర్ ఎస్.రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో ఎకరానికి రైతులు మొత్తం రూ.1200 చెల్లించాలని తెలిపారు.

సంక్షేమంలో సరికొత్త చరిత్ర

సీఎం జగన్‌తోనే అర్హులకు మేలు

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టిస్తున్నారని కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని అప్పారావుపేట గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారితకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పెద్ద పీట వేశారన్నారు. దేశానికి వెన్నుముక అయిన రైతు సంక్షేమానికి ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి, ధాన్యానికి మద్దతు ధర అందిస్తున్నారన్నారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలను గ్రామ స్థాయిలోనే కల్పిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన కార్యక్రమాల గురించి ప్రజలు ఆలోచించాలన్నారు. వెన్నుపోటు పొడవటంలో చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి పార్టీని, పదవిని చేజిక్కించుకున్నాడన్నారు. 2014లో ప్రజలకు అనేక హామీలిచ్చి విస్మరించాడని గుర్తు చేశారు. దీంతో ప్రజలు చంద్రబాబును తిరస్కరించారన్నారు. చంద్రబాబుతో జత కట్టిన పవన్‌కు వెన్నుపోటు తప్పదని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ రాష్ట్రానికి సీఎం జగన్ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో సీఎం జగన్, నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణను గెలిపించాలని కోరారు. తొలుత వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామానికి చేకూరిన 30 కోట్ల మూడు లక్షల 11వేల 628 రూపాయల లబ్ధి వివరాలతో కూడిన బ్యానర్‌ను, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అప్పారావుపేట, వెంకట్రావుపాలెం సర్పంచ్‌లు అరుగొల్లు శ్రీనివాస్, ఎలిపే గాంధీ, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జద్దు హరిబాబు, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, నాయకులు ముద్రగడ లలితకుమారి, నారపురెడ్డి సూర్యనారాయణ, మాదేపల్లి సూర్యనారాయణ, ఎస్‌కే.అబ్బు సాహెబ్, ఒగ్గాల మాధవ్, మాదేపల్లి నాగరాజు, అడపా హరిబాబు, అడపా విష్ణు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సంక్షేమ రాష్ట్రం జగన్‌తోనే సాధ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని 1వార్డు ఇన్‌చార్జి కొలుకులూరి ధర్మరాజు తెలిపారు. పట్టణంలోని 1వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే ప్రతి గడపకు సంక్షేమం పేరుతో ఎంతో లబ్ధి చేకూర్చారన్నారు. కుల, మతం, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించారన్నారు. అదేవిధంగా ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సమర్థ నాయకుడిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దివ్యకుమారి, ట్రెజరర్ జయరాం, నాయకులు గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, చామన సూర్యచంద్రరావు, అడ్డాల నర్సింహరావు, సందనాటి నాగరాజు, మారిశెట్టి రమణ, యజ్జల రాంబాబు, పట్నాల గణపతి, బొద్దాని శ్రీనివాస్, వాలంటీర్లు, గృహసారధులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే రావాలి

తణుకు టౌన్: పథకాలు అమలు కావాలంటే రాష్ట్రానికి మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరముందని ఎంపీపీ రుద్ర ధనరాజు చెప్పారు. గురువారం సాయంత్రం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని 1వ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అద్దా బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడు తూ రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పేదల ఇంటివద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో గ్రామంలో రూ.117 కోట్లు పైగా అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రూ. 31కోట్లు విలువైన అభివృద్ధి సంక్షేమ పనులు జరిగాయన్నారు. రాష్ట్రంలో పేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలను నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును, పార్టీ జెండాను మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, మండల సచివాలయాల కన్వీనర్ కరిబండి రాజేష్, మండల రైతు విభాగం అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, ఉప సర్పంచ్ కడియం వీరబాబు, ఎంపీటీసీలు పెనుమాక అశోక్, శ్రీనివాసు, ఈవోపీఆర్డీ ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి నరశింహమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల ఇంట వెలుగులు

అత్తిలి: గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తూ, పేదలకు ఆర్థిక భరోసా కల్పించిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ పతాకాన్ని మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ ఎగురవేశారు. సచివాలయం వద్ద సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరాలు తెలిపే డిస్‌ప్లే బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపాలన భవిష్యత్‌లో కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తణుకు నియోజకవర్గంలో రాష్ట్రమంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు సారథ్యంలో గ్రామాలలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, జెడ్పీటీసీ అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్వీఎస్ రెడ్డి, కంకటాల సతీష్, ఎంపీడీవో అమీలుజమా, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఈవోఆర్డీ శ్రీనివాస్, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్జునుడు పాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్

ఇరగవరం: మండలంలోని అర్జునుడు పాలెంలో గ్రామంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలో సంక్షేమ పథకాల బోర్డులను వైఎస్సార్ నాయకులు అధికారులు ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కావాలంటే తప్పనిసరిగా ముఖ్యమంత్రి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. నాలుగేళ్ల పాలనలో మంత్రి కారుమూరి హయాంలో అర్జునపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు గ్రామాలోని కుటుంబలు వద్దకు వెళ్లి చేకురిన లబ్ధి, పథకాల వివరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, మండల పార్టీ యూత్ అధ్యక్షుడు సుబ్బా రెడ్డి, ఎంపిడివో ఎ శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్ విస్తరణ అధికారి నరసింహ మూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: అప్పారావుపేట గ్రామంలో జరిగిన సభలో మాట్లాడుతున్న కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్



తణుకు టౌన్: దువ్వ గ్రామంలోని 1వ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పథకాలతో అందరికీ ప్రయోజనం

పెంటపాడు: పేదల సంక్షేమం సీఎం జగనన్న ద్వారానే సాధ్యమని వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి పెంటపాడు మండలం అలంపురం గ్రామంలో పార్టీ నాయకులు, ఏఎంసీ డైరెక్టర్ దెందుకూరి సూర్య నారాయణరాజు (సూరిబాబు) ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, ఎంపీపీ దాసరి హైమావతి తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో విశాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతుందన్నారు. అధికారంలోకి రావడం కోసం ప్రతిపక్షాలు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు పలు రాష్ట్రాల సీఎంలు కొనియాడుతున్నారన్నారు. అన్ని గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టిన జగనన్నను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. జిల్లా, మండల వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రజల ముగింటకే ప్రభుత్వ సేవలు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ముందుగా సచివాలయం–1 వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, సచివాలయాల కన్వీనర్ మైలవరపు పెదబాబు, చెన్నా జనార్ధన్, కొలనువాడ సీతారామరాజు, రాపాక కుమారి, బేబీ, గ్రామ కార్యదర్శి బేగ్, ఈవోపీఆర్డీ ప్రసాద్, శివారెడ్డి, వలంటీర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడు: సమావేశంలో మాట్లాడుతున్న కొట్టు విశాల్, తదితరులు



తాడేపల్లిగూడెం అర్బన్: 1వవార్డులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కొలుకులూరి ధర్మరాజు



అత్తిలి: ఆరవల్లిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఇరగవరం: అర్జునుడు పాలెంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న దృశ్యం



ఇరగవరం: సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు

క్లుప్తంగా

వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించాలి



ఎంఈవో–2 పీఎంకే.జ్యోతి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 2023–24 సంవత్సరానికి గాను బడ్జెట్ ప్రతిపాదనలు పంపించాలని ఎంఈవో–2 పీఎంకే.జ్యోతి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జ్యోతి మాట్లాడుతూ బడ్జెట్‌లో ప్రతి పాఠశాల వారు స్కూల్ డవలప్‌మెంట్, హేబిటేషన్ ప్లాన్‌లో విద్యార్థుల వయస్సు, తరగతుల వారీగా వివరాలు, పరీక్షల్లో గ్రేడ్‌లు, మౌలిక వసతులు, బడి బయట పిల్లలు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు కావాల్సిన పరికరాలు, పాఠశాల నిర్వహణకు అవసరమైన నిధుల వివరాలను, ఆవాస ప్రాంతాల్లో బడి ఈడు పిల్లల వివరాలను పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదిలోగా వాటిని ఎంఈవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో స్ట్రాంగ్ టీచర్ రాజు, సీఆర్‌పీ బత్తుల నానిబాబు పాల్గొన్నారు.

దిశ, పోక్సో చట్టాలపై అవగాహన సదస్సు



అత్తిలి డిగ్రీ కళాశాలలో దిశ చట్టంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అత్తిలి: స్థానిక ఎస్వీఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దిశ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భీమవరం దిశ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ప్రసాద్ పోక్సో, దిశ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ శర్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బీరా శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



అత్తిలిలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి కల్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అత్తిలి విశ్వబ్రాహ్మణ కమ్యూనిటిహాల్ భవనంలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో పట్నాల నాగ రాజేష్, సరోజ దంపతులచే కల్యాణతంతు జరిపారు. క్రొవ్విడి వెంకన్నబాబు అర్చకత్వంలో పూజాదికాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణసంఘం అధ్యక్షుడు పట్నాల బాబు, కార్యదర్శి అనుపోజు అప్పలస్వామి, బల్లంకి ఆచారి, పట్నాల నాగరాజు, ముదపాక బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో మెగా జాబ్ మేళా



మెగా జాబ్ మేళాకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని డీఆర్ గోయంకా మహిళా కళాశాలలో శుక్రవారం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 10వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ విద్యార్హతతో సుమారు 16 కంపెనీలకు చెందిన ప్రతినిధులు, సుమారు 500లకు పైబడి యువతీ, యువకులు హాజరయ్యారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో పాటు ఉపాధి కల్పన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మేనేజర్ పార్థసారధి, ఉపాధి కల్పన విభాగం కోఆర్డినేటర్ ప్రవీణ్, ప్రిన్సిపల్ గణపతి రామ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఫేస్‌యాప్ హాజరు రద్దు చేయాలి

అత్తిలి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీల ఫేస్‌యాప్ ద్వారా హాజరు విధానాన్ని రద్దు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల జిల్లా అధ్యక్షుడు తేలి శాంతి స్వరూప్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన అత్తిలిలో మాట్లాడుతూ ఫేస్ యాప్ వల్ల సాంకేతికంగా ఎన్నోలోపాలు ఉన్నాయని, వయస్సు పైబడిన కూలీలకు పలు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు సరైన మొబైల్ ఫోన్ సౌకర్యం లేకుండా పనిభారం పెంచడం, ఫీల్డ్‌అసిస్టెంట్ల వ్యవస్థను పంచాయతీలో విలీనం చేయడం ద్వారా ఉద్యోగులు మనోవేదన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల యాప్ జీఓను రద్దు చేయకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కె రమేష్, మహేష్‌రెడ్డి, పిల్లి ఏసురత్నం, సూర్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే భవిత

అత్తిలి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం ప్రమోదకుమారి చెప్పారు. బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కిశోర బాలికలు, తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాలల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆడపిల్లల చదువు ప్రాముఖ్యత, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఆశారోహిణి, సెక్టార్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి, మహిళా సంరక్షణ అధికారి, ఆరోగ్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధికి సహకరించాలి

తణుకు టౌన్: సమాజంలో బాలికల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి చెప్పారు. శుక్రవారం తణుకు మండలం ముద్దాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహించిన బేటీ బచావో, బేటి పడావో అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మి మాట్లాడుతూ బాలికల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలల్లో అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆడ పిల్లల చదువు ఆవశ్యకత, లింగ వివక్ష, పౌష్టికాహారం, బాల్య వివాహాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



అత్తిలిలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీడీపీఓ ప్రమోదకుమారి



ముద్దాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు

వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడిగా బాబూరావు

తణుకు అర్బన్: తణుకు జోన్ వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రసాదరెడ్డి, అధ్యక్షుడిగా కె.బాబూరావు, కార్యదర్శిగా ఆర్.రామకృష్ణ, కోశాధికారిగా పి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా వై.సోమయాజులు, వై.సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా టి.వినోద, బి.రవిబాబు, జిల్లా కార్యవర్గానికి ఉపాధ్యక్షుడిగా జి.మల్లికార్జునరావు ఎంపికయ్యారు. మండల ఇన్‌చార్జ్‌లుగా తణుకు మండలానికి ఎస్.సూర్యనారాయణ, ఆచంట మండలానికి చిరంజీవి, అత్తిలి మండలానికి తాతారావు, యలమంచిలికి టి.భాస్కర్, పోడూరు వినాయకరెడ్డి, పెనుమంట్రకి పి.శ్రీనివాసరెడ్డి, ఇరగవరంకి ఎస్.సతీష్‌బాబు, పెనుగొండకి నరేష్ ఎంపికయ్యారు. ఈ నూతన కార్యవర్గాన్ని జిల్లా పీఈటీ, పీడీల సంఘ అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి, జిల్లా కోశాధికారి కె.సుబ్బారావు, స్కూల్ గేమ్స్ మాజీ సెక్రటరీ బి.జాన్సన్ పాల్గొని ధ్రువీకరించినట్లు అధ్యక్షుడు కె.బాబూరావు తెలిపారు.



కె.బాబూరావు, అధ్యక్షుడు



ఆర్.రామకృష్ణ, కార్యదర్శి

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

పెంటపాడు: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల రెడ్‌రిబ్బన్ క్లబ్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు కళాశాల విద్యార్థుల నుంచి భీమవరంకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు విక్టర్ ప్రేమ్‌సాగర్, జె. విజయబాబు తదితరులు రక్తదానం చేసిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నేడు న్యాయవాదుల కార్తీక వన సమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో నిట్ రోడ్డులో నయారా పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న నల్లమిల్లి గాంధీరెడ్డి తోటలో న్యాయవాదుల కార్తీక వన సమారాధన ఈ నెల 25వ తేదీన శనివారం నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, బహుమతులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయవాదులు, గుమస్తాలు కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరారు.

ఉమా సోమేశ్వరునికి అభిషేకాలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక గునుపూడి పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానంలో స్వామివారికి శుక్రవారం చిలుకుద్వాదశి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకుడు చేకూరి రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానంలో కార్తీకమాసోత్సవాల్లో భాగంగా 11వ రోజు భక్తులు దర్శనముల ద్వారా రూ.15,450, పూజా రుసుముల రూ.16,150 ఆదాయం వచ్చిందన్నారు.

టైల్స్ చోరీపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం టైల్స్ చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని నరసింహపురం గోడౌన్‌లో భద్రపరిచిన సుమారు రూ. 2 లక్షలు విలువ చేసే టైల్స్ ఈనెల 22న చోరీకి గురైనట్టు వ్యాపారి తటవర్తి చరణ్ తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

భక్తి మార్గమే సన్మార్గం



డీసీసీబీ చైర్మన్ పీవీఎల్‌ను, చైర్‌పర్సన్ జామి హైమావతిని సత్కరిస్తున్న దృశ్యం

ఆకివీడు: భక్తి మార్గమే సన్మార్గమని, యువత ఆధ్యాత్మిక భావాలతో ముందుకు వెళ్లాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. స్థానిక మాదివాడలోని శ్రీ కృష్ణ దేవరాయ యూత్ ఆధ్వర్యంలో 14వ దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పీవీఎల్‌తో పాటు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీలను సత్కరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, కౌన్సిలర్‌లు నిమ్మల నాగు, ఎండీ జక్కీ, నాయకులు కేశిరెడి మురళీ, అంబటి రమేష్, ఎస్కే హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యా ప్రణాళికల తయారీపై శిక్షణ

భీమవరం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో భీమవరం రూరల్, అర్బన్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, ఆవాస ప్రాంత విద్యా ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ కోర్స్ డైరెక్టర్లు, భీమవరం ఎంఈఓలు ఎన్ శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి ఖచ్చితమైన సమాచారం నమోదు చేయాలన్నారు.

పెన్షనర్ల సంఘ బలోపేతానికి కృషి చేస్తా

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పెన్షనర్స్ సమస్యలను పరిష్కరిస్తానని పెన్షన్ల సంఘం అధ్యక్షుడు హరికుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సంఘం అధ్యక్షుడిగా బి.హరికుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.బాలకృష్ణ, సెక్రటరీగా వై.వి.సత్యనారాయణమూర్తి, కోశాధికారిగా ఎండీ ముస్తాఫా, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎం.అర్జునరావు, విశ్వం రాజు, కర్రి సూరెడ్డి, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, బీహెచ్ సత్యనారాయణ రాజు, తదితరులు నియమితులయ్యారు. పెన్షనర్ల సంఘ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దాసం నాగేశ్వరరావు, అడపా వెంకటాచలం, గరికపాటి సుబ్రహ్మణ్యశర్మ, వెంకటేశ్వరరావు, పార్వతి, వంగపండు రామ్మోహన్‌రావులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బి.హరికుమార్

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆరోగ్య సిబ్బందిచే శుక్రవారం 19, 21, 22, 23, 24, 25 వార్డుల్లో శుక్రవారం డ్రై డే, ఫ్రై డే, ఫీవర్ సర్వేలు క్షేత్రస్థాయిలో పరిశీలన, వెక్టార్ కంట్రోల్ హైజీన్ అమలు, దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు పుట్టకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు రజనీ, సరస్వతి, వెంకటలక్ష్మి, భారతి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.



వార్డులో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది